క్లుప్తంగా

నూతన కమిటీ ఎన్నిక


అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు

కొత్తూరు: కొత్తూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ శనివారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. అధ్యక్షురాలిగా ఎస్.అనూరాధ, ప్రధాన కార్యదర్శిగా కె.వి.హేమలత, 18 మంది సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ కార్యకర్తలు, హెల్పర్ల వేతనాలు పెంచాలని ప్రభుత్వాన్ని కోరారు. సమ్మె కాలంలో విడుదల చేసిన జీఓలో తెలిపిన ఒప్పందాలు అమలు చేయాని డిమాండ్ చేశారు. హిరమండలం మండలంలోని కోరాడ అంగన్‌వాడీ కేంద్రం హెల్పర్‌గా విధులు నిర్వహిస్తూ మృతిచెందిన అప్పలనర్సమ్మ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. యూనియన్ నాయకులు కె.లక్ష్మి, జలజాక్షి, ధనలక్ష్మి, రజనీ తదితరులు పాల్గొన్నారు.

పశువులకు లంపీస్కిన్ టీకాలు


పశువులకు వ్యాక్సిన్లు వేస్తున్న పశువైద్య సిబ్బంది

సరుబుజ్జిలి: మండలంలోని షళంత్రి గ్రామంలో పశువుకు లంపీస్కిన్ (ముద్ద) వ్యాధి టీకాలు శనివారం వేయడం జరిగినట్లు పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సి.హెచ్.సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ నెల చివరి వరకు మండలంలోని అన్ని గ్రామాల్లో ఈ టీకాలు వేస్తామని వెల్లడించారు. పాడి రైతులు ఈ సదావకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారి సతీష్‌కుమార్, జేవీఓ పిల్లా పైడిరాజు పాల్గొన్నారు.

ఎరువుల పంపిణీ


ఎరువులు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు, తదితరులు

ఎల్.ఎన్.పేట: రైతులకు ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో ఎరువుల కొరత లేకుండా ముందస్తుగా చర్యలు తీసుకోవాలని జెడ్పీటీసీ కిలారి త్రినాథులు, యంబరాం సర్పంచ్ వెలమల గోవిందరావు అన్నారు. మండలంలోని యంబరాం గ్రామంలోని రైతు సేవా కేంద్రం వద్ద శనివారం ఎరువులు పంపిణీ చేశారు. డీఏపీ, యూరియా, గ్రోమోర్, పొటాష్ లాంటి ఎరువులు కొరత లేకుండా చూడాలన్నారు. ఖరీఫ్‌లో అధిక దిగుబడులు సాధించేందుకు వ్యవసాయ శాఖ సిబ్బంది రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఏఎఓ పైడి లతశ్రీ, రైతులు రామారావు తదితరులు పాల్గొన్నారు.

గోతులను పూడ్చారు


గోతులను పూడ్చుతున్న దృశ్యం

కొత్తూరు: మండల కేంద్రంలోని ఏబీ రోడ్డులో గల ఎస్సీ బాలుర వసతి గృహం వద్ద ఏర్పడిన గోతులును శనివారం పూడ్చారు. ప్రయాణికులు, గ్రామస్తులు స్థానిక సర్పంచ్‌కు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు సర్పంచ్ పడాల కృష్ణవేణి, వైఎస్సార్‌సీపీ నాయకుడు పడాల లక్ష్మణరావు స్పందించి గోతులను పూడ్చారు. ఇది ఇలా ఉండగా స్థానిక టీడీపీ నేతలు స్టోన్ డస్టును తీసుకువచ్చి ఇవే గోతులను పూడ్చటం జరిగింది.

నేడు లయన్స్ క్లబ్ కార్యవర్గం ప్రమాణం

నరసన్నపేట: స్థానిక మిలీనియం నరసన్నపేట లయన్స్ క్లబ్ 2024–25కు నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం ఆదివారం నిర్వహిస్తున్నట్లు పూర్వపు అధ్యక్షుడు సదాశివుని కృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నూతనంగా అధ్యక్షుడిగా రమణ సాహు, కార్యదర్శిగా కలివరపు సాయిరాం, ట్రెజరర్‌గా కోరాడ వైకుంఠరావు తదితరులు నూతన కార్యవర్గంగా ఎన్నిక అయ్యారని, వీరు ప్రమాణ స్వీకారం చేస్తారన్నారు. ముఖ్య అతిథిలుగా ఉత్తరాంధ్రకు చెందిన పలువురు లయన్స్ క్లబ్ ప్రతినిధులు హాజరుకానున్నారని తెలిపారు.

వేతనాలు చెల్లించాలి

సారవకోట: మండల కేంద్రంలోని ఎమ్మార్సీలో విధులు నిర్వర్తిస్తున్న సమగ్ర శిక్షా సిబ్బందికి గత మూడు నెలలుగా వేతనాలు అందక అవస్థలు పడుతున్నారు. ఈ కార్యాలయంలో నలుగురు సీఆర్పీలు, ముగ్గురు కార్యాలయ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. తమ సమస్యను ఉన్నతాధికారులు గుర్తించి వేతనాలు విడుదల చేయాలని కోరుతున్నారు.

శివారు గ్రామాలకు..
సాగునీరు అందేనా?

- ముంపు గ్రామాల రైతులకు కష్టాలు తొలిగేనా..
- సాగునీటికి ఇబ్బందులు


పోలాకి మండలం చెల్లాయివలస వద్ద నీరులేక విత్తనాలు మొలకెత్తని వరి పొలం


లుకలాం వద్ద నీరు లేక ఎండి పోతున్న వరి వెద పొలాలు

నరసన్నపేట: జిల్లాలోనే నరసన్నపేట నియోజకవర్గంలో అధిక శాతం మంది రైతులు వరి పంట సాగు చేస్తున్నారు. నరసన్నపేట, పోలాకి మండలాల్లోని శివారు గ్రామాలకు ఈ ఏడాది కూడా సాగునీటి కష్టాలు తప్పేలా లేవు. రైతులు ఇబ్బంది పడుతున్నా.. ప్రత్యామ్నాయ చర్యలు కనిపించడం లేదు. వర్షం పడితేనే శివారు గ్రామాల్లో వరి పొలాలకు సాగు నీరు అందుతుంది. కాలువల ద్వారా నీరు అందే పరిస్థితిలేదు. ప్రస్తుత ఖరీఫ్‌లో అయినా కష్టాలు తీర్చాలని, కాలువల ద్వారా సాగు నీరు అందించాలని రైతులు కోరుతున్నారు. షట్టర్లు మరమ్మతు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

శివారు గ్రామాలు ఇవే..
నరసన్నపేట మండలంలో ముషిడిగట్టు, లుకలాం, కామేశ్వరిపేట, పోతయ్యవలస, దేవాది, గోపాలపెంట, మడపాం, బుచ్చిపేట, మాకివలసలో కొంత భూమి ఉంది. పోలాకి మండలంలో డీఎల్ పురం, మగతపాడ, కోడూరు, ప్రియాగ్రహారం, చెల్లాయివలస, అంబీరు పేట, సుసరాం గ్రామాలున్నాయి. ఈ ఏడాది నరసన్నపేట మండలంలో 7,496 హెక్టార్లు, పోలాకి మండలంలో 7,852 హెక్టార్లలో వరి పంట సాగు చేస్తున్నారు.

ముంపు కష్టాలు..
మరోవైపు నరసన్నపేట, పోలాకి మండలాల్లో ముంపు గ్రామాల రైతుల కష్టాలు మరోలా ఉన్నాయి. మామిడివలస, చిక్కాలవలస, కంబకాయలో కొంత ప్రాంతం, పోలాకి మండలంలో కూడా తంపర భూములు ముంపునకు గురవుతున్నాయి.

మా కష్టాలు తీర్చండి



పోతయ్యవలసతో పాటు పలు శివారు గ్రామాలకు సకాలంలో సాగు నీరు అందడం లేదు. వంశధార అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదు. వరి పైరు గింజ కట్టే దశలో నీరులేక నష్టం పాతున్నాం. ఈ సీజన్‌లో అయినా తగిన చర్యలు తీసుకోవాలి. గెడ్డవానిపేట వద్ద వంశధార మొగలో ఇసుక మేటలు తొలగిస్తే మబగాం చానల్ ద్వారా నీరు వస్తుంది.
– కనపల శేఖరరావు, నీటి సంఘం మాజీ అధ్యక్షుడు, పోతయ్యవలస, నరసన్నపేట మండలం

శివారు గ్రామాలకు ప్రాధాన్యం ఇవ్వండి



ప్రస్తుతం వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా శివారు గ్రామాలకు సాగునీరు అందించేందుకు వంశధార ఇంజినీర్లు చర్యలు తీసుకోవాలి. వర్షాలు అధికమైతే పొలాలు ముంపునకు గురవుతున్నాయి. వర్షాభావ పరిస్థితులు ఏర్పడితే నీరులేక ఎండి పోతున్నాయి. సాగునీరు అందిచేందుకు వీలుగా శాశ్వత పరిష్కారం చూపాలి. రైతులకు ఏటా కలుగుతున్న నష్టాలను తగ్గించాలి.
– బలగ జనార్దనరావు, సత్తరవుపేట, పోలాకి మండలం

కోర్టులో కేసు ఉండగా విమర్శించడం తగదు


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి బూర్లె శ్రీనివాసరావు

కొత్తూరు: కోర్టులో కేసు పెండింగ్‌లో ఉంటుండగా తాను అవినీతికి పాల్పడినట్లు పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు విమర్శించడం తగదని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి బూర్లె శ్రీనివాసరావు అన్నారు. కొత్తూరు మండలం మెట్టూరు బిట్-1 (కృష్ణాపురం)లో శనివారం విలేకరులతో మాట్లాడారు. వంశధార నిర్వాసితుల ప్యాకేజీ చెల్లింపుల్లో, ఇళ్ల స్థలాల మంజూరులో రూ.1.05 కోట్లు అవినీతికి పాల్పడినట్లు ఎమ్మెల్యే ఆరోపించడం అన్యాయమన్నారు. దీనిపై అప్పట్లో విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టి కేసు నమోదు చేసినట్లు గుర్తు చేశారు. ఈ కేసులో 21 మంది నిందితులు ఉండగా.. అందులో 18 మంది ప్రస్తుతం టీడీపీలోనే ఉన్నారన్నారు. తాను అవినీతి చేసినట్లు రుజువైతే ఏ శిక్ష విధించినా సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. హిరమండలం మండలం శుభలాయి నిర్వాసిత కాలనీలో ఇళ్ల పట్టాలు తీసుకున్నవారే.. మెట్టూరు బిట్-1 ఆర్ఆర్ కాలనీలోని రిజర్వ్ స్థలంలో అక్రమంగా పట్టాలు పొందినవారు ఉన్నారన్నారు. ఇటువంటి అక్రమాలపైనా విచారణ చేపట్టాలన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు తిర్లింగి మోహన్‌రావు, పతివాడ శివాజీ తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ రోగికి ఆర్థిక సాయం


సాయాన్ని అందజేస్తున్న దృశ్యం

సంతబొమ్మాళి: మండలంలోని బడే కుప్పన్నపేట కేంద్రంగా పని చేస్తున్న కేపీ స్పందన ఫౌండేషన్, వల్లేవలసకు చెందిన మనబడి వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు కిడ్నీ మార్పిడి చేయించుకున్న యువకుడికి అండగా నిలిచారు. ఆమదాలవలసకు చెందిన 22 ఏళ్ల గయ సందీప్ కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడేవారు. దీంతో తల్లి కిడ్నీ దానం చేయడంతో మూత్రపిండ మార్పిడి శస్త్ర చికిత్స విశాఖలోని ఓ ఆస్పత్రిలో చేశారు. ఈ విషయం తెలుసుకున్న స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఆర్థిక సాయం చేసేందుకు ముందుకు వచ్చారు. మందుల కొనుగోలు, వైద్య పరీక్షలు, నిర్వహణ ఖర్చులకు స్పందన ఫౌండేషన్ రూ. 15 వేలు, మనబడి అసోసియేషన్ ప్రతినిధులు పది వేల రూపాయలను ఆస్పత్రికి శనివారం వెళ్లి బాధితుడికి అందజేసి ఆదర్శంగా నిలిచారు. అసోసియేషన్ ప్రతినిధులు షణ్ముఖరావు, రెడ్డి సూరిబాబు, శివారెడ్డి, అప్పన్న ఉన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

శ్రీకాకుళం న్యూకాలనీ: ప్రభుత్వ, జిల్లాపరిషత్ ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న సమగ్రశిక్షా వర్క్, ఆర్ట్, వ్యాయామం విద్య ఉపాధ్యాయులు తమకు ఉద్యోగ భద్రత కల్పించి న్యాయం చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఇల్లీసుపురంలోని అంబేడ్కర్ విజ్ఞాన మందిరంలో జిల్లాస్థాయిలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆ సంఘ జిల్లా గౌరవ అధ్యక్షులు గుడివాడ కామేశ్వరరావు, అధ్యక్షులు ఎర్ర సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి లోపింటి దిలీప్, ఉపాధ్యక్షులు చిగిలిపల్లి శ్రీనివాసరావు మాట్లాడారు. అరకొర వేతనాలతో పని చేస్తున్న తమకు కూటమి ప్రభుత్వం న్యాయం చేయాలని వేడుకున్నారు.

రోడ్డా.. డంపింగ్ యార్డా..!


రోడ్డుకు పక్కన ఉన్న ఖాళీ కొబ్బరి బొండాలు

సారవకోట: మండలంలోని బుడితి నుంచి బద్రి వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డుకు పక్కన లక్ష్మీపురం గ్రామానికి సమీపంలో ఖాళీ కొబ్బరి బొండాలు పడేస్తున్నారు. ఖాళీ కొబ్బరి బొండాల్లో నిల్వ ఉన్న నీటిలో డెంగీ దోమలు వ్యాపిస్తాయని వైద్యులు అవగాహన కల్పిస్తున్నా ఎవరూ పట్టించుకోవడంలేదు. వర్షా కాలం కావడంతో వ్యాధులు వ్యాపిస్తాయని సమీపంలో ఉన్న గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు.

నృత్య ప్రదర్శనలో ద్వితీయ స్థానం



నిర్వాహకులతో శివ కేశవ నృత్య కళానికేతన్ బృందం



నృత్య ప్రదర్శన నిర్వహిస్తున్న రామదేవాన్షి, స్తోత్ర

ఆమదాలవలస: పట్టణానికి చెందిన శివ కేశవ నృత్య కళా నికేతన్ బృందానికి విశాఖపట్నంలో జరిగిన నృత్య పోటీల్లో ద్వితీయ స్థానం లభించింది. విశాఖపట్నానికి చెందిన నాట్యరవలి మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ నిర్వాహకులు యు.మహేష్ ఆధ్వర్యంలో కళా భారతి కన్వెన్షన్ హాల్లో ఈ నెల 11 నుంచి మూడు రోజులు పాటు 35వ అఖిల భారత నృత్య పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో రాష్ట్ర వ్యాప్తంగా వందకు పైగా నృత్య బృందాలు పాల్గొన్నాయి. శుక్రవారం 40 బృందాలు పోటీల్లో పాల్గొనగా శివ కేశవ నృత్య కళానికేతన్ ఆధ్వర్యంలో ఆమదాలవలస, హిరమండలం నృత్య బృందానికి చెందిన తమ్మన రామ దేవన్షి, స్తోత్రతోపాటు పదిమంది గ్రూప్ సభ్యులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో భరత నాట్యంతో పాటుగా ఇతర శాస్త్రీయ నృత్యాలను ఈ బృందం ప్రదర్శించింది. శివ కేశవ నృత్య కళానికేతన్ నిర్వహకులు భార్గవి, కృష్ణ తదితరులు హాజరయ్యారు. శివకేశవ నృత్య కళానికేతన్ బృందానికి ద్వితీయ స్థానం రావడం పట్ల ఆమదాలవలస పట్టణ ప్రజలు, కళాకారులు హర్షం వ్యక్తం చేశారు.

కాయగూరల సాగుతో అధిక లాభాలు


ఏటీఎం మోడల్‌గా పంట పొలంలో కూరగాయల విత్తనాలు నాటుతున్న సిబ్బంది

ఇచ్ఛాపురం రూరల్: హైబ్రీడ్ విత్తనాలు, రసాయనిక ఎరువులు, పురుగు మందుల వాడకానికి స్వస్తి పలికి ప్రకృతి వ్యవసాయం ద్వారా పెరటి తోటల్లో, పంట పొలాల్లో కాయగూరల సాగుతో అధిక లాభాలు పొందవచ్చని యూనిట్ ఇన్‌చార్జ్ మద్దిలి చిట్టిబాబు అన్నారు. పాయితారి గ్రామంలో ప్రకృతి వ్యవసాయం సిబ్బంది ఆధ్వర్యంలో కాయగూరల విత్తనాలను ఎలా నాటాలి, వ్యవసాయం ఎలా సాగు చేయాలి అనే అంశంపై రైతులకు శనివారం అవగాహన కల్పించారు. రైతులే కాకుండా భూమిలేని ప్రజలు సైతం తమ ఇళ్ల వద్దనే కొద్దిపాటి స్థలంలో ప్రకృతి వ్యవసాయంలో కూరగాయల సాగును చేసుకోవచ్చని అన్నారు. ఈ సందర్భంగా రైతు వలపల తుంబనాథం పంట పొలంలో 'ఏటీఎం' మోడల్‌గా కూరగాయలు నాటే ప్రక్రియను చేపట్టారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం ఐసీఆర్పీలు కె.కుమారీ, ఎం.సంతోషి, దుక్క స్వాతి, పిట్ట నాగమణి, కృష్ణవేణి పాల్గొన్నారు.

కొండ చీపుర్లతో గిరిజనులకు ఆదాయం


మెళియాపుట్టి: చీపురు విత్తనాలను అందజేస్తున్న సీసీ జగన్

మెళియాపుట్టి: గిరిజన ప్రాంతాల్లో అత్యధికంగా పోడు వ్యవసాయంతో ఆర్థికంగా ప్రయోజనం చేకూరేలా కృషిచేస్తున్నామని కొత్తూరు వెలుగు అసోసియేషన్ సీసీ జగన్ అన్నారు. గొట్టిపల్లి పంచాయతీలోని 17 మంది గిరిజన రైతులకు చీపురు విత్తనాలు (దుంపలు) శనివారం అందజేశారు. రూ.1,800 విలువ చేసే యూనిట్ విత్తనాలను కేవలం రూ.450 కే 17 యూనిట్లు అందిసున్నామన్నారు. గిరిజన ప్రాంతాల్లో ఎటువంటి ఎరువులు వినియోగించకుండా ప్రకృతి సిద్ధంగా పంటలు పండించి భావితరాలకు ఆరోగ్యదాయకమైన పంటలను అందించడానికి కృషిచేయడమే అసోసియేషన్ ముఖ్య ఉద్దేశమన్నారు. గత ఏడాది 53 మంది రైతులకు అందించిన చీపురు విత్తనాల ద్వారా ఒక్కో రైతు రూ.8,000 లబ్ధి పొందినట్లు తెలిపారు. సర్పంచ్ ఆదిలక్ష్మి, మొబలైజర్స్ కల్యాణి, హరిశ్చంద్రరావు, రైతులు ఉన్నారు.

పాతపట్నం: గిరిజనులు కొండ చీపురులను సాగు చేయడం వల్ల లాభదాయకంగా ఉంటుందని కొత్తూరు వెలుగు అసోసియేషన్ సీసీ జగన్ అన్నారు. మండలంలోని కొమ్ములగూడ, బెన్నాగూడ, కరడాసింగి గూడ, లక్ష్మిగూడ, బూర్జ గూడ, గోడియాపాడు గిరిజన గ్రామాల్లో కొత్తూరు వెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో కొండ చీపుర్ల విత్తనాలు (దుంపలు) శనివారం పంపిణీ చేశారు.

సమస్యల పరిష్కారానికి కృషి


ఎమ్మెల్యే గోవిందరావును సత్కరిస్తున్న సంఘం సభ్యులు

పాతపట్నం: నియోజకవర్గంలో విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యుల సమస్యలను పరిష్కారానికి కృషి చేస్తానని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు హామీ ఇచ్చారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల పక్కన ఉన్న కల్యాణ మండపంలో నియోజకవర్గ విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో విశ్వకర్మ ఆలయం నిర్మాణానికి, విశ్వబ్రాహ్మణ కమిటీ భవనం నిర్మాణానికి తనవంతు సహాయం ఉంటుందని హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యేకు సంఘం తరఫున సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు తులసీవరప్రసాద్, తూలుగు తిరుపతిరావు, నియోజకవర్గం విశ్వబ్రాహ్మణ అధ్యక్షుడు కొత్తపల్లి రవి, మండల అధ్యక్షుడు పొట్నూరు ఉపేంద్ర ఆచారి తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడులు


మాట్లాడుతున్న పట్టాభిరామిరెడ్డి


పాల్గొన్న చెరకు రైతులు

నరసన్నపేట: చెరకులో యాంత్రీకరణతోపాటు ఆధునిక పద్ధతులు పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని ఈఐడీ–ప్యారీ ఇండియా లిమిటెడ్ హెడ్ పట్టాభిరామిరెడ్డి అన్నారు. నరసన్నపేటలోని కల్యాణ మండపంలో దేవాది డివిజన్ పరిధిలోని చెరకు రైతులతో శనివారం అవగాహన సమావేశం నిర్వహించారు. చెరకు సాగులో మెలకవలు పాటించాలని, నూతన పద్ధతులు అవలంబించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. యాంత్రీకరణను వినియోగిస్తే ఖర్చు తగ్గుతుందన్నారు. నాణ్యమైన, నూతన రకాలు నాటడం ద్వారా మంచి దిగుబడులు వస్తాయన్నారు. క్రమ పద్ధతిలో సూక్ష్మ పోషకాలు, ఎరువుల వినియోగం చాలా ప్రధానమన్నారు. ప్రధాన శాస్త్రవేత్త షన్ముఖ సుందరం మాట్లాడుతూ.. యంత్రాలతో చెరకును సకాలంలో నరికించి ఫ్యాక్టరీకి పంపడంపై ప్రతి రైతూ అవగాహన పొందాలన్నారు. ఫ్యాక్టరీ ఇచ్చే రాయితీలు వినియోగించుకోవాలని సూచించారు. ఎకరాకు కనీసం 40 టన్నుల దిగుబడి వస్తే మంచి ఆదాయం వస్తుందన్నారు. కేన్ హెడ్ రాజేంద్రన్, విస్తరణ హెడ్ రమేష్, మేనేజర్లు కమల్, మురళి, దేవాది డివిజన్ ప్రతినిధి వైకుంఠరావు, నరసన్నపేట, పోలాకి, గార, శ్రీకాకుళం, జలుమూరు మండలాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

రామ, పరశురామ అవతారాల్లో జగన్నాథుడు


ఎల్.ఎన్.పేట: శ్రీరామ అవతారంలో జగన్నాథ స్వామి


పాతపట్నం: పరశురామ అవతారంలో జగన్నాథుడు

ఎల్.ఎన్.పేట: మండలంలోని లక్ష్మీనర్సుపేట గ్రామంలో గల జగన్నాథ స్వామి శనివారం శ్రీరామ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. రథయాత్ర ఉత్సవాల్లో భాగంగా ఆలయ అర్చకులు వినోద్ కుమార్ పత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేశారు.

పాతపట్నంలో..
పాతపట్నం: స్థానిక బ్రాహ్మణవీధిలోని జగన్నాథస్వామి శనివారం పరుశురామ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామి వారి రథయాత్ర మహోత్సవాల్లో భాగంగా ఏడో రోజు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అర్చకుడు చంద్రశేఖర్ పండా ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పశుగ్రాసం సాగుపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న ఏడీ ఆనందరావు, తదితరులు


పశుగ్రాస పొలాలను పరిశీలిస్తున్న ఏడీ ఆనందరావు

ఆమదాలవలస: పాడి పరిశ్రమ లాభసాటిగా ఉండాలంటే ప్రతీ పాడి రైతు పశుగ్రాసం సాగు చేయాలని పశుసంవర్ధకశాఖ ఆమదాలవలస ఏడీ ఆర్.ఆనందరావు సూచించారు. పశుగ్రాస వారోత్సవాల్లో భాగంగా ఆమదాలవలస మండలంలోని బొడ్డేపల్లిపేట, కృష్ణాపురం, శ్రీహరిపురం తదితర గ్రామాల్లో శనివారం పశుగ్రాసాలు వేసిన పొలాల్లోకి వెళ్లి రైతులకు అవగాహన కల్పించారు. పశుగ్రాసాలు సాగు చేయడం ద్వారా దాణా ఖర్చులు తగ్గుతాయన్నారు. పాల ఉత్పత్తి పెరుగుతుందని సూచించారు. పశువులు కూడా ఆరోగ్యంగా ఉంటాయన్నారు. ప్రతి పశు పోషయకుడు ఐదు నుంచి ఆరు పశువులు పెంచేటప్పుడు ఎకరా పొలంలో పశుగ్రాసం వేసుకోవాలని సూచించారు. ఏక, బహు వార్షిక పశుగ్రాసాలను సాగు చేసుకోవాలన్నారు. పశుసంవర్ధక శాఖ సిబ్బంది, వెటర్నరీ పాలిటెక్నిక్ విద్యార్థులు, పాడి రైతులు పాల్గొన్నారు,

ఇసుక కష్టాలు..


స్టాక్ పాయింట్ నుంచి తొలుసూరుపల్లి రోడ్ వరకు భారీగా నిలిచిపోయిన ట్రాక్టర్లు

టెక్కలి: టెక్కలిలోని ఆర్టీసీ డిపో సమీపంలోని స్టాక్ పాయింట్ వద్ద ఇసుక కోసం ట్రాక్టర్ యజమానులు పడుతున్న కష్టాలు రోజు రోజుకూ ఎక్కువవుతున్నాయి. స్టాక్ పాయింట్ నుంచి తొలుసూరుపల్లి రోడ్‌లో గల వంశధార కాలువ వరకు పదుల సంఖ్యలో ట్రాక్టర్లు నిలిచిపోయాయి. స్టాక్ పాయింట్ వద్ద వివరాలు నమోదు చేస్తున్న సిబ్బంది సంఖ్యను పెంచితే తమకు ఈ కష్టాలు ఉండవని ట్రాక్టర్ యజమానులు, డ్రైవర్లు గోడు వెల్లబుచ్చుకుంటున్నప్పటికీ అధికారులు స్పందించడం లేదని వాపోతున్నారు. రోజూ ఇసుక కోసం వచ్చి గంటల తరబడి నిరీక్షించాల్సిన దుస్థితిని తట్టుకోలేకపోతున్నామని వాపోతున్నారు.